


# మట్టి గణపతే.. మహాగణపతి

- మట్టి విగ్రహాలతో సహజత్వాన్ని కాపాడుదాం
- కలెక్టర్లు వెంకటేష్ దోత్రే, అభిలాష అభినవ్
- మట్టి ప్రతిమలను పంపిణీ చేసిన కలెక్టర్లు..


ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం ౹ 26 ఆగస్టు 2025 ౹ ■ 13 పేజీలు





## కలుపుమందు

# పిచికారీలో జాగ్రత్త

- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు..
- రసాయణాల స్ప్రేలో అవగాహన అవసరం
- కూలీలు అందుబాటులో లేక చౌకగ లభిస్తున్న గడ్డి మందు వినియోగిస్తున్న రైతులు
- వాడకంపై అవగాహన లేమీ..
- మార్కెట్‌లో పుట్టగొడుగుల్లా కలుపుమందు..
- పిచికారీ సమయంలో పంటలపై ప్రభావం
- విచ్చలవిడి విక్రయాలతో రైతుల బలవన్మరణాలకు కారణమవుతోందని ఆవేదన
- మోతాదుకు మించి వినియోగం వద్దు..
- ఒకే సారి 3,4 మందుల వాడకం ప్రమాదకరం

వ్యవసాయంలో రైతులు ఎదుర్కొనే సమస్యలు అన్నీఇన్నీ కావు. పంట దిగుబడి ఇంటికి చేర్చే వరకు కంటికి రెప్పలా కాపాడు కోవాలి. విత్తనం వేసింది మొదలు కోత కోసే వరకు తెగుళ్లు, పురుగుల బెడద నుంచి రక్షించుకోవాలి. పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. చీడపీడల నివారణకు ఉపయోగించే క్రిమి సంహారక మందులు పిచికారిలో నిర్లక్ష్యంగా ఉండటంతో ఏటా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పత్తి పంటలో మందుల స్ప్రే పనులు జోరుగా సాగు తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.




# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి
- దళారులను ఆశ్రయించవద్దు
- లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్..

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆశించిన ఫలితాలను సాధిస్తుందని లబ్ధిదారులకు పూర్తి పారదర్శకతతో ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఐటిడిఎ పీఓతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు.

## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులకు మంచిర్యాల ప్రేంసాగర్ రావు ఎమ్మెల్యే సవాల్

తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన కొద్ది రోజుల్లోనే నియో జకవర్గంలో అభివృద్ధి పనులు చేశానని, కానీ కొందరు అది జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అభివృద్ధి విషయంలో బిజెపి, బీఆర్ఎస్ పార్టీల నాయ కులతో బహిరంగ చర్చకు సిద్ధమా అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వారికి సవాల్ విసిరారు.





# యూరియా కొరతపై బీఆర్ఎస్ కన్నెర్ర

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంపై ఫైర్..
- రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు
- ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యేలు
- ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం
- ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి

యూరియా కొరతపై బీఆర్ఎస్ కన్నెర్ర చేసింది. రైతులతో కలిసి ఆందోళన బాట పట్టింది. సోమవారం పలుచోట్ల చేపట్టిన ధర్నాల్లో పాల్గొని సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార కేంద్రం ఎదుట రైతులు చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు.



## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- ఉత్సవాలను ప్రశాతంగా జరుపుకోవాలి
- ఎస్‌హెచ్‌వోలకు ఫింగర్ ప్రింట్ డివైస్‌లు
- కుమ్రంభీం ఎస్పీ కాంతిలాల్ పాటిల్

## ఎస్‌బిఐ ఖాతాదారులు సహకరించాలి

- బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన
- ఖాతాదారులకు ఎటువంటి నష్టం జరగనివ్వం
- ఎస్‌బిఐ ఆర్ఎం రితీష్ కుమార్ గుప్త



# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**







**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం శేషపల్లి గ్రామానికి చెందిన నక్క పవన్ కుమార్ తమ కుటుంబం గత సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని కొంతమంది అక్రమంగా ఆక్రమించుకొని తమను బెదిరిస్తున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండల కేంద్రానికి చెందిన పుప్పాల మహేష్ తనకు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/ జూనియర్ కళాశాలలో బి. సి. క్యాటగిరి క్రింద ఎం.పి.సి. మొదటి సంవత్సరంలో సీట్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నెపల్లి మండలం దాంపూర్ గ్రామానికి చెందిన అర్కాం గంగారాం, అర్కాం పోశయ్య తాము గత 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని తమ పేరిట పట్టా చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కొప్పుల సత్యనారాయణ తమ తాతల నుండి తమకు రావలసిన వాటా భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం బూడిదగడ్డ బస్తీకి చెందిన ఎనగందుల మౌనిక ఇందిరమ్మ ఇండ్ల అర్హుల సర్వేలో తనను అర్హులుగా ఎంపిక చేశారని, కానీ అర్హుల జాబితాలో తన పేరు లేదని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూరు పట్టణానికి చెందిన దొంగారి సాంబక్క తన భర్త చనిపోయినందున తనకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట పట్టణం గోదావరి రోడ్ కు చెందిన మామిడి రాజశేఖర్ తాను ఇంటర్ ఒకేషనల్, ఎంఎల్‌టి తఒక సంవత్సరం శిక్షణ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం రామ్ నగర్ ప్రాంతానికి చెందిన చిట్యాల లింగయ్య, భీమయ్య, కంది సమ్మిరెడ్డి లు తమ దరఖాస్తులో వారి నివాసాలకు వెళ్లే దారిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, రోడ్డుపై చెత్త వేసే వారికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంచిర్యాల జిల్లా చౌక ధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో గత 5 నెలలుగా రేషన్ డీలర్లకు రావలసిన కమిషన్ విడుదల చేయాలని కోరారు. మందమర్రి మండలం శంకర్ పల్లి గ్రామస్తులు తమ గ్రామం నుండి సండ్రోన్ పల్లి గ్రామానికి వెళ్లే రహదారి మరమ్మత్తులు చేపట్టి పాలవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొట్టే సంపత్ కుమార్ తమ గ్రామానికి ప్రధాన రహదారి ధ్వంసమైనందున రసూల్ పల్లి నుండి చిర్రకుంట వరకు రెండు వరసల రహదారి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ చర్యలు

**విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి**
**ర్యాగింగ్‌కు గురైతే ప్రిన్సిపాల్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలి**
**బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు**



**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ కు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాస రావు హెచ్చరించారు. సోమవారం బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ర్యాగింగ్ నియంత్రణపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థలలో ర్యాగింగ్ కు పాల్పడడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందన్నారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, ముఖ్యంగా సీనియర్ల ముసుగులో జూనియర్ విద్యార్థుల పట్ల అసాంఘిక ఆకృత్యాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతుందన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టడానికి యాజమాన్యం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇందులో భాగంగా ప్రతి విద్యాసంస్థలు యాంటీ ర్యాగింగ్ కమిటీ స్క్వాడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాలలో నూతనంగా వచ్చిన విద్యార్థులను ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు 24 గంటలు హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులపై ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని కోరారు. ర్యాగింగ్‌కు గురైతే ప్రిన్సిపాల్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని నిర్మూలించగలగమన్నారు. ర్యాగింగ్‌కు గురైతే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ర్యాగింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలిపేందుకు శ్రీనివాసరావు సీఐ బెల్లంపల్లి వన్ టౌన్ (8712656559), ఎస్సై హైమ (871258 1092), హెడ్‌కానిస్టేబుల్ స్వప్న (871258 0662) మొబైల్ నెంబర్‌లలో సంప్రదించాలని సిఐ శ్రీనివాసరావు కోరారు.



# సీపీఐ నాయకులు ధర్నా

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని.. పంట నష్టపోయి రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వర్షానికి రోడ్లు, కల్వర్టు. వంతెన కోతకు గురై చాలా గ్రామాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటికి మరమ్మతులు చేయడంతో పాటు దెబ్బతిన్న పంటలను సర్వే చేసి.. రైతులకు ఎకరాకు రూ. 15 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఉపేందర్, ఆత్మకూరి చిరంజీవి, బద్రి సాయి తదితరులు ఉన్నారు.

# ప్రతి పల్లెకు పల్లె వెలుగు బస్సు

**నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ డిపో పరిధిలోని ప్రతి పల్లెకు పల్లె వెలుగు బస్సు నడిపేలా చర్యలు తీసుకుంటున్నట్టు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి బస్సులను నడిపించేందుకు ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కొన్ని ఏళ్లుగా ప్రయాణికులు ఆదరించక, రవాణా మార్గం సరిగ్గా లేక రద్దు చేసిన పలు గ్రామాలకు బస్సులను పునరిద్ధిస్తున్నట్లు డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు.

# సొసైటీ ఎదుట రైతుల ధర్నా

**వాంకిడి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**



యూరియా కొరతను నిరసిస్తూ సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు వాంకిడి ప్రాథమిక సహకార సొసైటీ ఎదుట రైతు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ సర్కార్ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులకు యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్య పట్టింపు లేని కారణం ఎరువుల దుకాణదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో 500 నుంచి 600 వందలకు బస్తా విక్రయిస్తున్నారన్నారు. మరోపక్క రైతులు తమ వ్యవసాయ పనులు వదులుకొని యూరియా కోసం ఇటూ షాపు, అటూ సహకార సొసైటీ కార్యాలయం ఎదుట ఉదయం నుంచి వేచి ఉండాల్సిన దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. కొన్ని సొసైటీల్లో అందుబాటులో ఉన్న పంపిణీలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ దుస్థితి లేదని చెప్పుకొచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు అజయ్ కుమార్, వినోద్, రైతులు పాల్గొన్నారు.

# చెత్త బయట పడేస్తే జరిమానా

**తాండూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని రేచిని గ్రామ పంచాయతీలోని వివిధ షాపు యజమానులకు సోమవారం గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని షాపు యజమానులు చెత్తను బయటపడేయొద్దని, బయట వేస్తే జరిమానా విధిస్తామని సూచించారు. పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడానికి అందరూ సహకరించాలన్నారు.



# హామీలను నెరవేర్చాలని వినతి

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సోమవారం బిజెపి మండల అధ్యక్షులు కోరి పోతన్న ఆధ్వర్యంలో బిజెపి నాయకులు డిప్యూటీ తహశీల్దార్ తెలంగ్ రావు కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయం లేదని బిజెపి నాయకులు పేర్కొన్నారు. రైతులకు పంట నష్టపరిహారం, రుణమాఫీ, పింఛన్లు, అర్హులైన లబ్దిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కోరి పోతన్న, దేవోజి భూమేష్, సప్పటోల్ల పోతన్న, తాటివార్ రమేష్, సాయినాథ్, మోహన్ యాదవ్, శ్రీనివాస్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.





## వినాయ నవరాత్రులను
# సామరస్యంతో జరుపుకోవాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పురస్కరించుకొని గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా సామరస్యంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్, పంచాయతీ, పోలీస్, విద్యుత్ ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటు కొరకు పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాలని, అనుమతి పొందిన గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్ల సమీపంలో మండపాలను నిర్మించవద్దని, రక్షణతో కూడిన వైరింగ్ వ్యవస్థను వినియోగించాలని, షార్ట్ సర్క్యూట్ లను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇన్వర్టర్లు, జనరేటర్లను ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్త వహించాలని, విద్యుత్ సిబ్బందితో వైరింగ్ తనిఖీ చేయించుకోవాలని, ఇందు కొరకు టోల్ ఫ్రీ నం.1912లో సంప్రదించాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి మండపం ఎత్తు, వెడల్పు, ఏర్పాటు చేసిన ప్రదేశం వివరాలను సమర్పించినట్లయితే నిమజ్జనం రోజున రూట్ మ్యాప్ రూపొందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అగ్ని ప్రమాదాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం రోజున ఆబ్కారీ మధ్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గాను చెరువులు, గోదావరి నది, ఇతర నిమజ్జన ప్రాంతాలను సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, మున్సిపల్, పంచాయితీ శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇందారం సమీపంలోని గోదావరి వంతెన వద్ద సింగరేణి ఆధ్వర్యంలో నిమజ్జనానికి అవసరమైన లైట్లు, క్రేన్లు ఇతర ఏర్పాట చేయాలని తెలిపారు. డీసీపీ మాట్లాడుతూ గత సంవత్సరం 2 వేల 400 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయడం జరిగిందని, ఈసారి మండపాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి గొడవలు, ప్రాణ నష్టం జరగకుండా నిఘా నిర్వహిస్తామని, మండపాల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపాలలో రాత్రి పూట నిర్వాహకులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, భారీ విగ్రహాల వద్ద సి. సి. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## జర్నలిస్టులకు ఇండ్ల
# స్థలాలు ఇవ్వాలని వినతి

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని జర్నలిస్టు యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) ముథోల్ శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీలతకు సోమవారం వినతిపత్రంఅందజేశారు. ప్రజల సమస్యలు, సామాజిక అంశాలు, ప్రభుత్వ పథకాలను సమాజానికి చేరవేయడంలో పాత్రికేయులు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పల్లెల నుండి పట్టణాల వరకు 24 గంటలూ శ్రమిస్తూ ప్రజాసేవలో అహర్నిశలు కృషి చేస్తున్నప్పటికీ, ఇళ్ల స్థలాల విషయములో ప్రభుత్వ సహకారం అందించడం లేదన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు షఫీ ఉల్లాఖాన్, పీసర శ్రీనివాస్ గౌడ్, పోతాజీ, లోలం భూమన్న, రాహుల్, సునీల్, రాజేశ్వర్, నగేష్, గంగారెడ్డి, ఖాలిక్, చంద్రమణి,శరత్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
గణేష్ నిమజ్జన ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ముథోల్ సిఐ మల్లేష్ కోరారు. ముథోల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం రోజున నిర్వహించిన మండల శాంతి కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదు, ఏడు, తొమ్మిది రోజులకు నిర్వహించే నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపల వారు ఆన్లైన్‌లో అనుమతి పొందాలన్నారు. డిజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి అనుమతి ఉంటుందన్నారు. నిమజ్జనం రోజు పోలిసులకు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్య మీ దృష్టికి వచ్చిన వెంటనే పోలిసులకు తెలిపాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ బిట్ల పెర్సిస్,హిందు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ళ రమేష్, మాజీ ఎంపిపి ఎజాజుద్దిన్, బిజేపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి,బిడిసి అధ్యక్షుడు విఠల్, మాజీ సర్పంచ్ బోయిడిఅనిల్, నాయకులు పతంగి కిషన్, పోతన్న యాదవ్, ఖాలిద్ పటేల్, ఆయా మండపల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.




# రేషన్ కమీషన్ విడుదల చేయలని వినతి

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
గత ఐదు నెలలుగా తమకురావలసిన కమిషన్ డబ్బులు ప్రభుత్వంవెంటనే విడుదల చేయాలని కోరుతు మండల రేషన్ డీలర్లు సోమవారం తహశీల్దార్ శ్రీలత కు వినతి పత్రం అందజేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే కమిషన్ డబ్బులను వేర్వేరు కాకుండా పాత పద్ధతి లో ఒకేసారి విడుదల చేయాలని వినతి పత్రం లో కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు లోలం భూమన్న, అశోక్,భోజారాం, గంగారెడ్డి, హైమద్, సర్దార్ ఖాన్, నిజాముద్దీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# సమస్యలు పరిష్కరించండి
### సబ్ కలెక్టర్‌కి రేషన్ డీలర్ల వినతిపత్రం

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
తమ సమస్యలను పరిష్కరించాలంటూ భైంసా వ్యాప్త రేషన్ డీలర్స్ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజ్మీర సాంకేత్ కుమార్‌కి వినతీ పత్రంను అందజేశారు. గత ఐదు నెలలుగా తమకు రావలసినటువంటి బిల్లులు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం గౌరవ వేతనం లాంటి హామీలు నెరవేర్చక పోవడం గురించి కలెక్టర్‌కి తెలిపారు. కాగా ఈ వినతి పత్రం అందించిన వారిలో భైంసా రేషన్ డీలర్ అధ్యక్షుడు గోపాల్ దాస్, ప్రధాన కార్యదర్శి కుంట రాజేశ్వర్, సురేష్, ఖలీద్, డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డు పేరిట
# రైతులు మోసపోవద్దు
### జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు

**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం రైతుల వివరాల గుర్తింపు కార్డుల గురించి ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని, జిల్లా రైతులు ఇలాంటి తప్పుడు సమాచారాలు నమ్మి ఎటువంటి గుర్తింపు కార్డులు తీసుకొని మోసపోవద్దని జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రైతు వివరాల నమోదు కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని ఆన్ లైన్ సేవ కేంద్రాలు, మీ సేవా కేంద్రాల వారు రైతుల వద్ద నగదు తీసుకొని గుర్తింపు కార్డు మంజూరు చేస్తున్నారని, ఇందు కొరకు ఎలాంటి మార్గదర్శకాలు ప్రభుత్వం జారీ చేయలేదని తెలిపారు. ఇతర వివరాల కొరకు రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

## వయోజనులకు ఉపయోగకరంగా
# అక్షర వికాసం, మార్గదర్శిని
### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
నిరక్షరాస్యులైన వయోజనులకు ఉల్లాస కార్యక్రమం వాచకాలు "అక్షర వికాసం, మార్గదర్శిని" పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అక్షర వికాసం, మార్గదర్శిని పుస్తకాలను జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లాస కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులకు చదువు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా రూపొందించిన ఉల్లాస్ కార్యక్రమం వాచకాలు అయిన అక్షర వికాసం, మార్గదర్శిని పుస్తకాలు నిరక్షరాస్య వయోజనులకు ఉపయోగకరమని తెలిపారు. చదువు మధ్యలో మానివేసిన వయోజనులకు ఓపెన్ స్కూల్ ద్వారా ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్మీడియట్ చదువుకుని అవకాశం ఉందని, అర్హత గల ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు జనార్ధన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# మోతాదుకు మించి వినియోగం వద్దు

**పిచికారీలో జాగ్రత్త - నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు - రసాయణాల స్ప్రేలో అవగాహన అవసరం - ఒకే సారి మూడు, నాలుగు మందుల వాడకం ప్రమాదకరం**



**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

వ్యవసాయంలో రైతులు ఎదుర్కొనే సమస్యలు అన్నీఇన్నీ కావు. పంట దిగుబడి ఇంటికి చేర్చే వరకు కంటికి రెప్పలా కాపాడు కోవాలి. విత్తనం వేసింది మొదలు కోత కోసే వరకు తెగుళ్లు, పురుగుల బెడద నుంచి రక్షించుకోవాలి. పంటల ను కాపాడే ప్రయత్నంలో రైతులు ప్రాణం మీదికి తె చ్చుకుంటున్నారు. చీడపీడల నివారణకు ఉపయోగించే క్రిమి సంహారక మందులు పిచికారిలో నిర్లక్ష్యంగా ఉం డటంతో ఏటా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పత్తి పంటలో మందుల స్ప్రే పనులు జోరుగా సాగు తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**అవగాహన లోపంతో...**

రైతులు అవగాహన లోపంతోనే క్రిమిసంహారక మం దులు అధికంగా వినియోగిస్తున్నారు. ఒక్కో చేనులో అ యిదారు సార్లు వివిధ రకాల మందులు కలిపి స్ప్రే చే స్తున్నారు. పత్తి చేలల్లో రెండు సార్లు కలుపు నివారిణి, మరో నాలుగు సార్లు క్రిమిసంహారక మందులు పిచి కారి చేయాల్సి వస్తోంది. ఒక్కో రైతు పదేసి ఎకరాల్లో పత్తి సాగు చేయడంతో తక్కువ కాలంలో ఎక్కువ స్ప్రే చేసేందుకు థైవాన్, చైనా పవర్ స్ప్రేయర్లు వాడుతు న్నారు. ఈ స్ప్రేయర్లతో ఎక్కువ ఒత్తిడితో తుంపర్లుగా మందు పిచికారి అవుతుంది. కొట్టే వారి ఒంటిపై మందు పడటంతో పాటు కళ్లు, ముక్కు, నోట్లోకి పోతోంది. మందు ప్రభావంతో వెంటనే కంటి సమస్యలు వస్తున్నాయి. అప్పటికి అప్పుడు ఏమి కాకపోయినా మెల్లి మెల్లిగా మందు ప్రభావంతో రోగాలపాలవుతున్నారు. దీంతో మందుల పిచికారీ సమయాల్లో జాగ్రత్తలు పాటించక ఆసుపత్రుల పాలయ్యే వారు అధికం అయ్యారు.

**ఇదీ 'విష'యం..**

రసాయణాల్లో కీటక నాశినులు, శిలీంద్రనాశినులు, కలుపు నివారణ మందులు, పూత, కాతకు తోడ్పాటు నిచ్చే ఉత్ప్రేర కాలు ఉంటాయి. వీటిని పిచికారి చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మందుల్లో ఉండే క్రియాశీలక రసాయణాన్ని బట్టి విష తీవ్రత వివిధ స్థాయిల్లో ఉంటుంది. ఈ విష తీవ్రత ఆధారం చేసుకొని పురుగు మందులను నాలుగు రకాలుగా విభజించారు. మందు డబ్బాపై ముద్రిం చిన చిహ్నాన్ని చూసి తగిన జాగ్రత్తలు పాటించాలి. చిహ్నం ఎరుపు రంగులో ఉంటే చాలా ఎక్కువ, పసుపు రంగు ఎక్కువ, నీలం రంగు మధ్యస్థం, ఆకుపచ్చ రంగులో ఉంటే తక్కువ విష తీవ్రత ఉన్నట్టు గుర్తించాలి.

**పురుగు మందుల పిచికారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- పురగు మందు డబ్బా మూతను నోటితో తీయ రాదు. మందు ద్రావణాన్ని చేతులతో కలుపకూడదు. కర్రను ఉపయోగించి కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను వెడెల్పు పడేలా చేయరాదు.
- పిచికారి సన్నగా తుంపర్లుగా పడేలా చూసుకోవాలి.
- రెండు మూడు మందులు కలిపి పిచికారి చేయకూడదు.
- చేతులకు తొడుగులు, కంటికి అద్దాలు, ముక్కు, నోటికి మాస్క్ తప్పనిసరిగా ధరలించాలి.
- పైరు పెద్దదిగా ఉంటే హెల్మెట్ పెట్టుకోవడం ఉత్తమం.
- స్ప్రే చేసేటప్పుడు తినడం, తాగడం, పొగతాడం, కళ్లు నలుపుకోవడం, నోటిలో వేళ్లు పెట్టుకోవడం చేయకూడదు.
- గాలికి ఎదురుగా స్ప్రే చేయరాదు.
- గాయాలైన చేతులతో మందులను తాకరాదు. పిచి కారి పూర్తి అయిన వెంటనే సబ్బుతో స్నానం చేయాలి.
- ఖాళీ డబ్బాలను దూరంగా పాతిపెట్టాలి.

**ప్రథమచికిత్స...**

- పిచికారి సమయంలో మందు ప్రభావానికి గురైనప్పుడు తక్షణమే ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించాలి.
- కంట్లో మందు పడితే చల్లని నీటితో కడగాలి.
- ప్రభావానికి గురైన వ్యక్తిని వాంతి చేయించాలి.
- శరీర ఉష్ణోగ్రత పెరిగితే చల్లని నీటితో తుడువాలి. ఉష్ణోగ్రత తగ్గితే దుప్పటి కప్పి వెచ్చదనం ఉండేలా చూడాలి.
- దుష్ప్రభావానికి కారణమైన రసాయనాల వివరాలను వైద్యులకు తెలపాలి.

**ముందు జాగ్రత్తలు పాటించాలి**

మందులు పిచికారి చేసే సమయంలో రైతులు ముందు జా గ్రత్తలు పాటించాలి. పంట రోగాల బారిన పడితే అధికా రులను సంప్రదించి వారు సూచించిన మందులనే తగిన మోతాదులోవాడాలి. అధికంగా వాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. స్ప్రే చేసేటప్పుడు శరీరం మొత్తం కప్పబడే దుస్తు లు, మోఖానికి మాస్కు, చేతులకు తొడుగులు, కళ్లజోడు దరించాలి. స్ప్రే చేసిన చేతులతోనే పొగ తాగడం, గుట్కాలు వేసుకోవడం మం చిది కాదు. గాలికి ఎదురుగా కాకుండా గాలి వాటానికి అనుకూలంగా పిచికారి చేస్తే పంటకు బాగా పడుతుంది. మనిషికి ఇబ్బంది ఉండదు. ఎండకు కాకుండా ఉదయం, సాయంత్రం పూటల్లో పిచికారి చేసుకోవాలి.



## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

**బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులకు మంచిర్యాల ప్రేంసాగర్ రావు ఎమ్మెల్యే సవాల్**

**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన కొద్ది రోజుల్లోనే నియో జకవర్గంలో అభివృద్ధి పనులు చేశానని, కానీ కొందరు అది జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అభివృద్ధి విషయంలో బిజెపి, బీఆర్ఎస్ పార్టీల నాయ కులతో బహిరంగ చర్చకు సిద్ధమా అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వారికి సవాల్ విసిరారు. సోమవారం తన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లేనటువంటి మంచిర్యాలలో 400 మెగావాట్ల సబ్ స్టేషన్, లక్షెట్టిపేట్ లో 220 మెగా వాట్లా సబ్ స్టేషన్ ను, నస్పూర్ లో 130 మెగా వాట్లా సబ్ స్టేషన్ ను ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంది కాబట్టే నాపై కొందరు నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదని ఘాటుగా విమర్శిం చారు. బతుకమ్మ కానుకగా మహిళలకు శ్రీ శక్తి భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలి పారు.. మంచిర్యాల జిల్లాకు త్వరలోనే పలు స్కూల్ మంజూరు అవుతుందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నా యన్నారు. హాజీపూర్ మండలంలోని ముల్కల వద్ద నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ హబ్ ద్వారా రెండు వేల మం దికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేప ట్టామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులున్నారు.

## ఎస్‌బీఐ ఖాతాదారులు అధికారులకు సహకరించాలి

**ఎస్‌బీఐ ఆర్ఎం రితీష్ కుమార్ గుప్త**

**చెన్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పాత బస్టాండ్ ప్రాంతంలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో జరిగిన బంగారం, నగదు లావాదేవి స్కాంలో ఖాతాదారులు సంయమనం పా టించి సిబ్బందికి సహకరిం చాలని రీజనల్ మేనేజర్ రితీష్ కు మార్ గుప్తా అన్నారు. పట్ట ణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా కార్యాలయం ఎదుట నష్టపోయిన ఖాతాదారులు బ్యాంకు కార్యాలయం ముందు ఆందోళనకు దిగి మా బంగారం మాకు కావాలంటూ, ఖాతాదారులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ బాధిత ఖాతాదారుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఎటు వంటి నష్టం వాటి ల్లకుండా పై అధికారులతో మాట్లాడి న్యా యం చేస్తామని ఖాతా దారులు ధర్నాలకు ఆందోళనలకు దిగ డం సరియైన పద్దతి కాదని, బ్యాంకులో స్కామ్ జరిగినప్పటికీ



ఖాతాదారులకు సేవలు అందిస్తూ బ్యాంకు సేవలను కొనసా గిస్తున్నామని అదే విధంగా ప్రత్యేక అధికారులతో ఆడిట్ కూడా నిర్వహిస్తున్నా మని ఆయన అన్నారు. బ్యాంకులో జరిగి న 13.71 కోట్ల స్కామ్‌లో బ్యాంక్ ఉద్యోగి క్యాషియర్ నిందితుడని గుర్తించా మని అతనిని పట్టుకోవడానికి పోలీస్ శాఖ వారు అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపడుతున్నార ని ఆయన అన్నారు. బ్యాంకు ఉద్యోగులు ఖాతాదారులకు నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు.

## సోయా కొనుగోళ్లకు గోదాంలు సిద్ధం

**బోథ్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొచ్చెర గ్రామంలో ఉన్న గోదాంలో గత సంవత్సరం కొనుగోలు చేసి నిల్వ ఉంచిన సోయల బ్యాగులను ఖాళీ చేయిస్తున్నామని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు రంగారెడ్డి తెలిపారు. త్వరలో సోయా కొనుగోళ్లు చేపట్టనున్న నేపథ్యంలో పంట నిల్వ కొరకు గోదాం లను సిద్ధం చేస్తున్నామని, ముందు జాగ్రత్తగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

**తాంసి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

మండలంలో వడ్డాడి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠ శాలలో పనిచేస్తున్న కరీం అన్సారి (60) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం గుండెపోటు కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు.

# బీజేపీ-కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో యూరియా కొరత

**'స్థానిక' ఎన్నికల్లో మనదే విజయం**

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్**

**కాగజ్‌నగర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**



తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలే కారణమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కుమ్రం భీం ఆసిఫా బాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేస్తుంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒకరి మీద, ఒకరు నెట్టుకుంటూ డ్రామాలు చేస్తు న్నారని మండిపడ్డారు. మార్చిలో ముందస్తుగా బఫర్ స్టాక్ తెచ్చుకోకుండా రేవంత్ సరార్ ఏం చేసిందని ప్రశ్నించారు. సిర్పూర్ నియోజకవర్గంలో 50 శాతం యూరియా పంపిణీ పెండింగ్‌లో ఉందని, రైతులు ఇబ్బందులు పడుతుంటే స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ పట్టించుకోకుండా డ్రామాలు చేస్తు న్నారని మండిపడ్డారు. పాల్వాయి హరీశ్‌బాబు ధర్నా చేస్తూ, రైతుల ముందు సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో రాబోయే స్థానిక సం స్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుం దని, అన్ని మండలాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల న్నీ బీఆర్ఎస్ గెలవడం ఖాయమన్నారు. 40 ఏళ్లుగా నియోజ కవర్గాన్ని దోచుకున్న వారికి సిర్పూర్‌లో స్థానం లేదని, పార్టీని మోసం చేసి ఇతర పార్టీల్లో చేరి.. తిరిగి బీఆర్ఎస్‌లోకి వస్తే చేర్చుకునేందుకు అధిష్టానం సిద్ధంగా లేదన్నారు. సిర్పూర్ ప్రజలు కొత్త నాయకత్వాన్ని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 45 వేల మంది తనకు మద్దతుగా నిలిచారని, వారిని విడిచి ఎకడికీ వెళ్లేది లేదని స్పష్టం చేశా రు. కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగం బస్తీకి చెందిన యువ కులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, మహ్మద్ మిన్హాజ్, పార్వతి అంజన్న, వరలక్ష్మి, కమల పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను
# త్వరగా పరిష్కరించాలి

- అధికారులు సమన్వంతో అర్జీలను పరిష్కరించాలి
- మట్టి గణపతులను పూజిద్దాం..
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంటవెంటనే ఆన్ లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు వారి వారి మండలాలను సందర్శిస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ బడులు తనిఖీ చేయాలన్నారు. అనంతరం మట్టి గణపతులను పూజించే విధంగా అవగాహన కలిగించేలా అదనపు కలెక్టర్లతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని అన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను పూజించాలని చెప్పారు. దీని ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారిమి అవుతామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు పంట నష్ట
# పరిహారం అందించాలి

### తహసీల్దార్‌కు వినతి

**కుభీర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ శివరాజ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా నాయకులు పండిత్ జాదవ్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎకరాకు 25 వేల నష్టపరిహారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారనే భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను పొడిగించేందుకు బీసీ రిజర్వేషన్ అంశాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి ఎన్. వైద్యనాథ్, కందూరి చిన్న సాయినాథ్, రాథోడ్ కమలేష్, రాథోడ్ శంకర్ పాల్గొన్నారు.

# యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
రైతులకు యూరియా కొరత పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, వైఫల్యంపై ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మండిపడ్డారు. ఆసిఫాబాద్ రైతన్నలకు యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని నిరసిస్తూ, రైతుల పక్షాన ఆసిఫాబాద్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డికి కండ్లకు కనపడటం లేదా, చెవులకు వినపడటం లేదా అని ప్రశ్నించారు. నీకు పరిపాలన చేతకాకపోతే సీఎం పదవికి రాజీనామా చెయ్ అని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రైతు కూడా యూరియా కోసం ఇబ్బంది పడలేదని కోవ లక్ష్మీ గుర్తుచేశారు. రైతులకు 24గంటలు కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని ఆమె స్పష్టం చేశారు. రేవంత్, మంత్రులు దీనికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆనాటి రోజులు తెస్తా అని చెప్పి యూరియా కోసం లైన్లో చెప్పులు పెట్టే దుర్మార్గపు పాలన తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నల గోస మీకు కనిపిస్తలేదా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వాలు రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని, పంటలకు అత్యవసరమైన యూరియాను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

# గిరిజన తండాల్లో ఘనంగా తీజ్ వేడుకలు



**కుభీర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
బంజారాల సాంప్రదాయ వేడుకగా తీజ్ పండుగను గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని రంజిని తండాల్లో గిరిజనులు ప్రతి ఏటా భాద్రపద మాసం మొదటి వారంలో తట్ట, బుట్టలలో నవధాన్యాలను మొలకెత్తించి నీళ్లు పోసి తొమ్మిదవ రోజున నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుందని గిరిజనులు తెలిపారు. తమకు మంచి వరుడు దొరకాలని పెళ్లీడు యువతులు తొమ్మిది రోజులపాటు ఉపవాసాలు ఉండి బుట్టల్లోని నవధాన్యాల మొలకలకు నీళ్లు పోసి పూజలు చేయడం ఈ తీజ్ పండుగ ప్రత్యేకత. అనంతరంతాండలోని దుర్గాదేవి సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజనులు బంజారా పాటలను ఆలపిస్తూ డీజే చప్పుళ్ల మధ్య నృత్యాలు చేశారు.



# సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

**నార్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించామని డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణికి పలు అర్జీలు రావడంతో బాధితులను అడుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాథోడ్ గంగా సింగ్. ఏపీఎం జాడే రాజారాం, ఎంపీఓ సాయి ప్రసాద్, హాయ్ శాఖల అధికారులున్నారు.

## బాధిత కుటుంబాలకు
# రాథోడ్ జనార్ధన్ పరమార్శ

**నార్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
నార్నూర్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జాడే దయానంద్ తల్లి శాంతాబాయి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. శాంతాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శాంతాబాయి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అంతకుముందు భీంపూర్‌లో నిర్వహించిన తెర్వీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, ఉద్ధవ్ కాంబ్లే, డైరెక్టర్ దుర్గారావు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం పాల్గొన్నారు.



# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**తాండూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తాండూర్ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం మండల తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. అర్హులైన వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలన్నారు. నర్సాపూర్ గ్రామపంచాయతీకి వెళ్లే దారిలో భీమన్న వాగు పై హై లేవల్ బ్రిడ్జి నిర్మించాలని, గత కొన్ని సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా పాస్ బుక్‌లు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు,రాష్ట్ర సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శులు పుట్ట కుమార్, మామిడి విగ్నేష్, సీనియర్ నాయకులు సిద్ధం మల్లేష్, చొక్కాల నాగభూషణ్, మాజీ వార్డు సభ్యులు దుర్గ చరణ్, మండల ఉపాధ్యక్షులు రేవెల్లి శ్రీనివాస్, కొండు రవి, మండల కార్యదర్శి గాదె రాజేశం, మండల కోశాధికారి రాచర్ల సురేష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అడ్వల సతీష్, అరికల శంకర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఒత్తిడి నియంత్రణకు క్రీడలు అవసరం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం టేబుల్ టెన్నిస్ కోర్టును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రారంభించారు. యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ రెండవ అంతస్తులో ఏర్పాటు చేసిన కోర్టును కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కాసేపు టేబుల్ టెన్నిస్ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యాలయ పనిఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఉద్యోగులు, సిబ్బంది విధులు ముగిసిన తర్వాత కోర్టును వినియోగించుకోవాలని సూచించారు. టేబుల్ టెన్నిస్ ఆడటం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. అలాగే సాధారణ ప్రజల కోసం పట్టణంలో మరిన్ని టేబుల్ టెన్నిస్ కోర్టులను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, సిపిఓ జీవరత్నం, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



### బోధన ఉపకరణాలతో
## సబ్జెక్టుపై విద్యార్థుల ఆసక్తి పెంపు

**కాసిపేట, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులకు బోధన ఉపకరణాలతో బోధించడం వల్ల ఆసక్తి పెరుగుతుందని మంచిర్యాల డీఈవో యాదయ్య పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కాసిపేట ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధనోపకరణాల మేళా నిర్వహించారు. ఈ మేళాను డీఈవో ప్రారంభించి ప్రతి బోధనోపకరణాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతను అభినందించారు. ఆయన మాట్లాడుతూ బోధనోపకర ణాలు విద్యార్థుల్లో అభ్యాసం పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడతాయన్నారు. ప్రతి పాఠశాలలో బోధనోపకరణాల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. బోధనోపకరణాలు బోధనలో కీలక పాత్ర పోషిస్తాయని, ఉపాధ్యాయులు బోధనోపకరణాల ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు సత్యనారాయణ మూర్తి, విజయ లక్ష్మీ, మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వర స్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మామిడిపెల్లి సాంబమూర్తి, రమేష్ రాథోడ్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డొగర్‌గావ్‌లో రోడ్డు లేక గర్భిణీ మృతి



**వాంకిడి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

వాంకిడిలో డోగర్ గావ్‌కు సరైన రహదారి లేకపోవడంతో, భారీ వర్షాల కారణంగా మట్టిపెడ్డల రహదారి గుండా వెళ్లిన నిండు గర్భిణీ ప్రసవ సమయంలో మరణించిన సంఘటనపై కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకుడు దీపక్ ముండే ఆసిఫాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి నిరావ్ కుమార్ ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. డోగర్ గావ్ కు కనీసం రోడ్డు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

### పోడు పట్టాలకు బ్యాంకులు
## పంట రుణాలు ఇవ్వాలి
### మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

పోడు పట్టాలు కల్గిన భూములకు బ్యాంకు పంట రుణాలను ఇవ్వాలని మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా బ్యాంక్ అధికారులు రైతులకు పంట రుణాలు ఇవ్వకుండా బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటూన్నారని ఆరోపించారు. పోడు పట్టాలు కల్గిన రైతులకు బ్యాంకర్లు పంట రుణాలు అందించేలా చొరవ తీసుకుని కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు.



### అక్రమపట్టాను
## శాశ్వతంగా రద్దు చేయాలి



**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 8 లోని ప్రభుత్వ భూమి అక్రమ పట్టాను శాశ్వతంగా రద్దు చేయాలని బట్వాన్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమెరకు సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ను కలిసి అక్రమ పట్టాను రద్దు చేయాలని కోరారు. గ్రామ శివారులోని గ్రామచావిడి పరంపోగు ప్రభుత్వ భూమిని బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన దుర్గం ధనుంజయ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుని పట్టా చేసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఆ స్థలం చుట్టూ కంచెను నిర్మించి ఆ కంచెకు ప్రభుత్వ విద్యుత్ స్తంభం నుండి అక్రమంగా విద్యుత్ తీసుకుని ప్రజలను చంపేందుకు ప్రయత్నించాడనీ గ్రామస్తులు పేర్కొన్నారు. అక్రమపట్టాను శాశ్వతంగా రద్దు చేసి దుర్గం ధనుంజయ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

### అక్రమ నిర్మాణాలను ఖాళీ చేయాలని
## సివిల్ జడ్జి నోటీసులు

**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలంలోని అకెనపల్లి శివారు లో గల సర్వే నంబర్ 3/పైకిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారులకు వెంటనే వాటిని ఖాళీ చేయాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి నోటీసులు జారీ చేశారు. 3/పైకి సర్వే నంబర్ లో ఉన్న 2.75 సెంట్ల భూమి కోర్టు కేసులో కొనసాగుతున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. అనధికారికంగా ఆక్రమించిన ఈ భూమిలో చేపట్టిన ఇళ్ళతో పలు నిర్మాణాలను స్వచ్ఛందంగా మూడు రోజుల్లో ఖాళీ చేయాలని, ఖాళీ చేయకపోతే కోర్టు ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ, పంచాయితీ, విద్యుత్తు శాఖల అధికారుల సహాయంతో నిర్మాణదారుల స్వంత ఖర్చులతో బలవంతంగా ఖాళీ చేయించడం జరుగుతుందని నోటీసులో పేర్కొన్నారు.





## మట్టి వినాయకులనే పూజిద్దాం
### పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

**కుభీర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలు శ్రేయస్కరమని ప్రధానోపాధ్యాయుడు దొంతుల సురేష్ పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పల్సి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు గాను ఉపాధ్యాయుడు లింగన్న ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులచే మట్టి విగ్రహాలను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ప్రతిష్టాపనలో మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్టించాలని కోరారు. దీని వల్ల పర్యావరణాన్ని పరిరక్షించినవారమవుతామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తమ ఇండ్లలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు మట్టి వినాయకుడి ప్రతిమలు తయారు చేశారు. తయారుచేసిన విగ్రహాలను విద్యార్థుల ద్వారా గ్రామంలో పంపిణీకి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్ భాస్కర్ రెడ్డి, ఎర్రన్న, మధుసూదన్, ఎల్లన్న, సంజీవ్ సి.ఆర్పి.బాలేరావ్ గంగాధర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 139 దరఖాస్తులు

**ఆదిలాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ట్రైనీ కలెక్టర్ సలోని వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 139 ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులు ప్రజావాణిలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించే విధంగా వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి




**నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**అధికారులు సమన్వయంతో అర్జీలను పరిష్కరించాలి - కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జన్కాపూర్ వార్డుకు చెందిన సమీనబేగం తన ఇల్లు ఇటీవల వర్షాలకు కూలిపోయిందని నష్టపరిహారం ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరికాలనీకి చెందిన తార తాను రెబ్బెన మండలం గంగాపూర్ శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా జారీ చేయాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన సమిత్‌దాస్ తన కూతురుకు ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ మైనార్టీ గురుకులంలో సీటు ఇప్పించాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్, దుర్గానగర్‌కు చెందిన సుమతి మండల్ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తన చేనులో వరి, పత్తి పంటలు మునిగిపోయాయని సర్వే జరిపి నష్టపరిహారం ఇప్పించాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌కు చెందిన చంద్రకాంత్ మండల్ తనకు జారీ చేసిన పట్టాదాపు పాసు పుస్తకంలో పేరు తప్పుగా నమోదు అయినందున సవరించాలని కోరారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన అక్షర చిట్‌ఫండ్ బాధితులు తాము అక్షర చిట్ ఫండ్‌లో జమ చేసిన డిపాజిట్ డబ్బులను ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజా అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యవసర కృత్యాలకు ఇక్కట్లు

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

భైంసా బస్టాండ్‌లో ఐదు రోజులుగా మరుగుదొడ్లు తెరుచుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రోజు సంత కావడంతో వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. అత్యవసర పరిస్థితిలో బహిర్భూమికి, మూత్రవిసర్జనకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు తమ బాధను ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రతినిత్యం వేల మంది ప్రయాణికులు రాకపోకలు చేస్తుంటారు. భైంసా డిపో పరిధిలోని బస్సులతో పాటు మహారాష్ట్ర, నిజామాబాద్ డిపోకు సంబంధించిన బస్సులు అనేక నడుస్తుంటాయి. ప్రయాణికులు తమ సమస్యను తీర్చుకోవడానికి ఎటు వెళ్ళాలో తెలియక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని వాపోతున్నారు. డిపో పరిధిలో ప్రతినిత్యం వేల సంఖ్యలో తిరిగే మహిళా ప్రయాణికులు, మహిళా సిబ్బంది, పరిస్థితి, దారుణంగా మారింది. అయితే దీనిపై భైంసా డిపో మేనేజర్ వివరణ కోరగా మెయింటెనెన్స్ చేసే వ్యక్తి మానుకోవడం వల్ల సమస్య తలెత్తిందని, సమస్యను పరిష్కరిస్తానన్నారు.



## బాలింతకు తప్పని దారి కష్టాలు



**బోథ్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

సోనాల మండలంలోని చింతల బోరి గ్రామం పెద్దగూడకి చెందిన రేణుక మూడు రోజుల క్రితం బోథ్ ఆసుపత్రిలో డెలివరీ అయ్యింది. అయితే సోమవారం బోథ్ నుండి ఆమె స్వగ్రామం అయిన పెద్దగూడకి వెళ్లడానికి బజార్ హత్నూర్ మండలానికి చెందిన 102 వాహనంలో బయలు దేరారు. గ్రామానికి వెళ్లే దారిలో వాగు ఉండడంతో వాహనం వెళ్లలేక పోవడం వల్ల 102 పైలెట్ భగత్ నవీన్ కుమార్ బాలింతను దగ్గరుండి వాగు దాటించి ఇంటి వరకు తీసుకెళ్లారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వాహనం పైలెట్‌ను అభినందించారు.

## రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ఆదిలాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

రిమ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్ కార్మికుల పెండింగ్ సమస్యలపై అదనపు కలెక్టర్ శ్యామలా దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నళిని రెడ్డి మాట్లాడుతూ... 3 సంవత్సరాలుగా వివిధ కాంట్రాక్టర్లు మారినా కానీ కార్మికుల సమస్యలు పరిష్కారం అవడం లేదన్నారు. రిమ్స్‌లోని శానిటేషన్ కార్మికులు, పేషెంట్ కేర్ కార్మికులు సెక్యూరిటీ కార్మికులు, దాయ కార్మికులు, 30 సంవత్సరాలుగా రిమ్స్‌లో పని చేసినప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రిమ్స్‌లోని అధికారులు విఫలమయ్యారని, కాంట్రాక్టర్ లకు వత్తాసు పలుకుతున్నారన్నారు. కార్మికులను పట్టించుకోకుండా కాంట్రాక్టర్లు శ్రమ దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ కాంట్రాక్టర్లు కట్ చేసినప్పటికీ ఇప్పటి వరకు ఈఎస్ఐ కార్డు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సమస్యలు పరిష్కరించని ఎడల, వేతనాలు పెంచకపోతే ధర్నా చేపడతామన్నారు.



## కొత్త రైలు అదిరింది..!

**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం కొత్త రైలు కనువిందు చేసింది. న్యూఢిల్లీ నుండి ఖాళీ కొత్త భోగీలతో బెంగళూరు వెళ్తున్న ఈ కొత్త రైలు బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో లోకో పైలట్ల మార్పులో భాగంగా మూడవ లైన్‌పై కొద్దిసేపు ఆగింది. కొత్త రైలు అందాన్ని చూస్తూ స్టేషన్ లోని ప్రయాణికులు మంత్రముగ్ధులయ్యారు. కొత్త అందాలని తనలో సింగారించుకున్న ఆ కొత్త రైలు స్టేషన్ నుండి వయ్యారంగా కదులుతున్న సమయంలో ప్రయాణికులు సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు.

## నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలి



**ఆదిలాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని జైనథ్ మాజీ ఎంపీపీ గోవర్ధన్ కోరారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేసిన ఆయన, రైతులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి, ఎకరానికి రూ. 30 వేల పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉషన్న, లింగారెడ్డి, పురుషోత్తం, వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

**రిమ్స్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి**

ఆదిలాబాద్ రిమ్స్ కార్మికులకు శ్రమకు తగిన వేతనం అందజేయాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నళిని రెడ్డి కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేస్తూ, కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ కాంతిలాల్**



**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కేసు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసు అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు రాబోయే గణేష్ నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో నియమనిబంధనలను వివరించాలన్నారు. శోభాయాత్ర సమయాల్లో డీజేలు పెట్టడం నిషేధమని, లక్కీడ్రా, లాటరీల నిర్వహణ రాష్ట్రంలో అనుమతి లేదని నిర్వహించే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా శోభాయాత్ర సమయంలో పకడ్బందీగా ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను చేయాలని తెలిపారు. అనంతరం అన్ని పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గంజాయి మత్తు పదార్థాలు, మట్కా జూదం, లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజం, డీసీఆర్‌బీ డీఎస్పీ విష్ణుమూర్తి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

**ఎస్‌హెచ్‌వోలకు ఫింగర్ ప్రింట్ డివైస్‌ల అందజేత...**

జిల్లాలోని పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫింగర్ ప్రింట్ డివైస్‌ల ద్వారా నేర విచారణలో నిందితుల గుర్తింపు త్వరగా సాధ్యమవుతుందని, నేర చరిత్ర కలిగిన వ్యక్తులను సులభంగా గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. నూతన సాంకేతిక పద్ధతుల వినియోగం ద్వారా నేరాలను అరికట్టడం, శాంతిభద్రతలు కాపాడటం పోలీసు శాఖ ప్రధాన ధ్యేయమని తెలిపారు.



## యూరియా కోసం ఎమ్మెల్యేల ధర్నా

### పాల్వాయిని అరెస్టు చేసిన పోలీసులు..

**కాగజ్‌నగర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

యూరియా కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జిల్లా కేంద్రంలోని పిఎసిఎస్ కేంద్రం వద్ద ధర్నా చేపట్టగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బట్ పల్లి చౌరస్తాలో ధర్నాకు దిగారు. జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకేసారి యూరియా కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కాగజ్ నగర్ లో ధర్నా చేపట్టడంతో ఇరువైపులా భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ధర్నా విరమించాలని పాల్వాయి హరీష్ బాబును కోరినప్పటికీ ఆయన వినకపోవడంతో అరెస్టు చేసి బలవంతంగా వాహనంలో అక్కడి నుండి తీసుకొని వెళ్లారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అన్ని మండలాలలో బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు సహకార సంఘాల ఎదుట రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాలు చేపట్టారు.

## యూరియా కోసం ఆందోళన బాట



**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ ఆసిఫాబాద్ రెండు అసెంబ్లీ సెగ్మెంట్ ఎమ్మెల్యేలు పాల్వాయి హరిష్ బాబు, కోవలక్ష్మి యూరియా కోసం రైతులతో కలిసి ఆందోళన బాట పట్టారు. సోమవారం కాగజ్ నగర్, ఆసిఫాబాద్ సహకార సొసైటీ కార్యాలయాల ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టిన ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వ్యవసాయ అధికారులు స్థానిక వ్యాపారాలతో కుమ్మక్కై యూరియా కృత్రిమ కొరత సృష్టించి.. బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని ఆరోపించారు. 280 రూపాయలకు లభించే యూరియా బస్తా రూ. 500 నుంచి రూ. 600 వందలకు అమ్ముతున్నారని..! ఈ విషయం వ్యవసాయ శాఖ అధికారులు తెలీకుండా ఉందని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే యూరియా కొరత ఏర్పడిందని నిలదీశారు. ఇక కాగజ్‌నగర్ ధర్నా చేస్తున్న పాల్వాయి హరిష్ బాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### ఖానాపూర్ ఎంపీడీవోగా

## రత్నాకర్ రావు బాధ్యతల స్వీకరణ

**ఖానాపూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ ఎంపీడీవోగా చిట్యాల రత్నాకర్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తానని, మారుమూల గ్రామాలను సందర్శించి ప్రజా అవసరాలు తీరుస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు.



### కోర్టు ఆదేశాలతో ఇళ్ల నిర్మాణాల

# కూల్చివేతలకు యత్నం

- సోమగూడెంలో ఆందోళన
- అడ్డుకున్న ఇళ్ల యాజమానులు, స్థానికులు
- 5రోజుల్లోగా తొలగించాలని అధికారుల ఆదేశాలు



**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 3/పైకిలో కోర్టు కేసులో ఉన్న ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను సోమవారం కూల్చివేసేందుకు అధికారులు ప్రయత్నించగా ఇళ్ల యజమానులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. కోర్టు కేసులో ఉన్న 2.75 సెంట్ల భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని భూమి యజమాని రామకృష్ణయ్య కోర్టులో కేసు వేశారు. 40 ఏళ్ల తర్వాత కేసు గెలవడంతో బెల్లంపల్లి సివిల్ జడ్జి అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల లోపు స్వచ్ఛందంగా 13 ఇళ్ల నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. నిర్మాణాలు తొలగించినట్లయితే అధికారులతో బలవంతంగా ఖాళీ చేయిస్తారని నోటీసులో పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టగా ఇళ్ల నిర్మాణదారులు ఆందోళనకు దిగి అడ్డుకున్నారు. భూమి యజమాని రాం కృష్ణయ్య మాట్లాడుతూ... 40 ఏళ్లుగా మా పట్టా భూమి కోసం పోరాటం చేయడంతో తమకు కోర్టు న్యాయం చేసిందని తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు తమ భూమిని ఇప్పించాలని వేడుకున్నారు. దీంతో నిర్మాణాలను ఐదు రోజుల్లోగా తొలగించాలని ఇళ్ల నిర్మాణదారులకు అధికారులు సూచించి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

## ఘనంగా అన్నాభావు సాఠె జయంతి



**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ముధోల్ మండలంలోని సరస్వతి నగర్ లో ఘనంగా సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నాభావు సాఠె 105వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరయ్యారు. అన్నబావు సాఠె విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అన్నాభావు సాఠె కష్టపడి విద్యాజ్ఞానాన్ని ఆర్జించి ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కవి,రచయితాగా గుర్తింపు పొందారని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కష్టపడి బలహీన వర్గాల్లో చైతన్యం కోసం పాటుపడిన, అన్నభావు సాఠె గారిని అందరూ ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలు ఎమ్మెల్యే విన్నవించగా గ్రామంలోని హనుమాన్ ,దత్తాత్రేయ మందిరాల మంజూరూ కొరకై కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న సిసి రోడ్డు , డ్రైనేజీ, నీటి సమస్యలు, పొలంకు వెళ్లే రోడ్లను, పాఠశాల మరమ్మత్తు కొరకై కృషి చేస్తానని గ్రామ అభివృద్ధి కొరకు దశలవారీగా పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బిజేపి మండలనాయకులు నర్సాగౌడ్, ఆత్మ స్వరూప్, రాంచందర్, శ్యామ్ పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుకుందాం





**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని, నీటి కాలుష్యాన్ని నియంత్రించాలని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణం పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రసాయనాలతో కూడిన రంగులు ఉపయోగించే తయారు చేసే గణపతి విగ్రహాల కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, నిమజ్జనం తర్వాత ఎక్కువ కాలం నీటిలో కరగకుండా ఉండటం వలన నీటి కాలుష్యం జరిగి జలచరాలకు హాని కలుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ˜రాజకీయాలకు అతీతంగా

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ముథోల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

రాజకీయాలకతీతంగా సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు .సోమవారం భైంసా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముధోల్ మండలానికి చెందిన 19మంది లబ్ధిదారులకు 4లక్షల 23వేయిల 500 వేల రూపాయల చెక్కులను అందించారం.ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు అనారోగ్యం బారిన పడితే ప్రభుత్వం తరపున సహాయం అందించడమే సీఎం సహాయ నిధి ధ్యేయమన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని ప్రజలు నేరుగా వచ్చి తమ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా వేలాది చెక్కులను 20 నెలల కాలంలో అందించడం జరిగిందన్నారు. సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్చార్జిమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల అప్పుడే రాజకీయాలని సంక్షేమ ఫలాలు అర్హులైన పేదవారికి అందించడమే తన ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో పోతన్న, ప్రవీణ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులపై కేసు నమోదు

**గుడిహత్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

గుడిహత్నూర్‌లో బీజేపీ నాయకులు సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీనివల్ల రవాణాకు అంతరాయం ఏర్పడి, ప్రజలకు ఇబ్బందులు కలిగాయని నేషనల్ హైవే అథారిటీ ఫిర్యాదు మేరకు గుడిహత్నూర్ పోలీసులు 20 మంది బీజేపీ నాయకులపై కేసు నమోదు చేశారు. పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, రాస్తారోకలు, సభలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఏఆర్ మురుగదాస్ మరో యాక్షన్ థ్రిల్లర్..




శివకార్తికేయన్ - ఏఆర్ మురుగదాస్ కాంబోలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ మదరాశి వచ్చే నెల సెప్టెంబర్ 5న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మూవీ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. 'మదరాశి' ఒక యాక్షన్ థ్రిల్లర్ గా ఉండబోతుందని తెలుస్తోంది. యాక్షన్ తో పాటు ఎమోషన్ కూడా బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. హీరో శివకార్తికేయన్, రుక్మిణీ వసంత్ మధ్య ఎమోషనల్ అండ్ రొమాంటిక్ సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే ట్రైలర్ లో భారీ యాక్షన్ బ్లాక్స్, గన్ ఫైట్స్ ఉత్కంఠగా అనిపించాయి. మురుగదాస్ గత సినిమాల వలే ఇది కూడా మాఫియా, యాక్షన్ నేపథ్యంలో సాగనున్నట్లు తెలుస్తోంది. ఇందులో విద్యుత్ జమ్వాల్ పవర్ ఫుల్ విలన్ రోల్లో నటించారు. ట్రైలర్ లో అతడి యాక్షన్ సన్నివేశాలు, డైలాగ్స్, సిక్స్ ప్యాక్ బాడీ విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఇక అనిరుధ్ రవిచంద్రన్ బీజీఎం ప్రేక్షకులకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి.

# నాకు అతడే స్ఫూర్తి

టాలీవుడ్ లో టాప్- 5 బెస్ట్ డ్యాన్సర్ల గురించి ప్రస్తావిస్తే, అందులో ఎన్టీఆర్, అల్లు అర్జున్, చరణ్, శ్రీలీల, సాయిపల్లవి పేర్లు ప్రముఖంగా జాబితాలో ఉంటాయి. అయితే జగపతిబాబు `జయమ్ము నిశ్చయమ్మురా` షోలో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల తల్లి గారైన డాక్టర్ స్వర్ణలత కుమార్తెకు సంబంధించిన ఒక ఆసక్తికర విషయం రివీల్ చేసారు. శ్రీలీలను డ్యాన్స్ శిక్షణలో చేర్పించడానికి జూనియర్ ఎన్టీఆర్ ఎలా స్ఫూర్తి నింపారో వెల్లడించారు. షోలో ఎన్టీఆర్ కూచిపూడి నేర్చుకుంటున్నప్పటి ఒక అందమైన స్టిల్ ని షేర్ చేయగా, ఆ ఫోటో వెనక స్టోరీని స్వర్ణలత వివరించారు. నాకు అమ్మాయి పుడితే డ్యాన్స్ నేర్పించాలని స్ఫూర్తి నింపిన క్షణానికి సంబంధించిన ఫోటో ఇది! అని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఎన్టీఆర్ ని కలిసారా? అని ప్రశ్నించగా, 1997లో అమెరికా లాస్ ఏంజెల్స్- తానా సభల్లో ఒకసారి ఎన్టీఆర్ ని కలిసి మాట్లాడిన విషయాన్ని స్వర్ణలత గుర్తు చేసుకున్నారు. తాను అనుకున్నట్టే శ్రీలీలకు డ్యాన్సులు నేర్పించానని తెలిపారు. హీరోయిన్ గా దూసుకెళుతున్నావ్.. చాలా మంది అవకాశాల్ని లాగేసుకుంటున్నావు కదా! అని షో హోస్ట్ జగపతిబాబు శ్రీలీలను ఆటపట్టించారు. ఈ షో ఆద్యంతం శ్రీలీల, ఆమె తల్లిగారైన స్వర్ణలత ఎన్నో ఆసక్తికర విషయాలను మాట్లాడారు. జీ5 ఓటీటీలో ఇది స్ట్రీమింగ్ అవుతోంది. నాగార్జున మొదటి అతిథిగా ప్రారంభమైన ఈ షోని జగపతిబాబు విజయవంతంగా నడిపిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్ లో బిజీ ఆర్టిస్ట్. మాస్ జాతర, పరాశక్తి లాంటి చిత్రాల్లో నటిస్తున్న ఈ బ్యూటీ తదుపరి పవన్ కల్యాణ్ సరసన `ఉస్తాద్ భగత్ సింగ్`లోను ఆడిపాడుతోంది. అలాగే బాలీవుడ్ క్రేజీ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ ప్రేమకథా చిత్రంలోను శ్రీలీల నటిస్తోంది. యంగ్ హీరో కార్తీక్ తో తెలుగు బ్యూటీ డేటింగ్ గురించి పుకార్లు వచ్చాయి.



# తల్లి కాబోతున్న పరిణీతి చోప్రా



బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా, ఆమె భర్త, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, తల్లిదండ్రులు కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ లో ఒక పోస్ట్‌ను షేర్ చేస్తూ ఈ శుభవార్తను ప్రకటించారు. మా చిన్న ప్రపంచం వస్తోంది అని క్యాప్షన్‌లో రాశారు. ఈ ప్రకటనతో పాటు, వారు ఒక అందమైన వీడియో, ఫోటోను షేర్ చేశారు. ఫోటోలో "1 + 1 = 3" అనే అక్షరాలతో ఒక ప్లేట్‌పై ఉన్న కేక్, చిన్న పాదాల ముద్రలు ఉన్నాయి. వీడియోలో వారు ప్రకృతిలో చేతులు పట్టుకుని నడుస్తున్నట్లుగా చూపించారు. ఈ శుభవార్తతో సోషల్ మీడియాలో సెలబ్రిటీలు మరియు అభిమానుల నుండి వారికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కాగా పరిణీతి చోప్రా, రాఘవ్ చద్దా 2023 సెప్టెంబర్ 24న రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో వివాహం చేసుకున్నారు.పరిణీతి చోప్రా 1988 మే 21 న హర్యానాలోని అంబాలాలో జన్మించారు. ఆమె ప్రముఖ నటి ప్రియాంక చోప్రాకు కజిన్. పరిణీతి లండన్ మ్యాంచెస్టర్ బిజినెస్ స్కూల్ నుంచి బిజినెస్, ఫైనాన్స్ మరియు ఎకనామిక్స్ విభాగాలలో ట్రిపుల్ హానర్స్ డిగ్రీని పొందారు. లండన్‌లో ఆమె ఆర్థిక రంగంలో ఉద్యోగం కూడా చేశారు. పరిణీతి నటనపై ఆసక్తి చూపడంతో 2011లో "లేడీస్ వర్సెస్ రికీ బెహ్ల్" అనే చిత్రంలో సహాయ నటిగా అవకాశం లభించింది. ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది.



# బిగ్ బాస్‌లోకి కుంభ్‌మేళా బ్యూటీ..

ప్రముఖ ఇన్‌ఫ్లూయెన్సర్, మహా కుంభ్‌మేళాతో సోషల్ మీడియాలో బాగా ఫేమస్ అయిన తాన్యా మిట్టల్ బిగ్ బాస్ 19 యాలిటీ షోలోకి అడుగుపెట్టారు. సల్మాన్ ఖాన్ హోస్ట్ చేస్తున్న ఈ సీజన్‌లో తాన్యా మిట్టల్ మూడో కంటెస్టెంట్‌గా హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. తాన్యా మిట్టల్ మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందినవారు. ఆమె ఒక ఇన్‌ఫ్లూయెన్సర్ కాగా ఇన్‌స్టాగ్రామ్ లో 2.5 మిలయన్ల ఫాలోవర్లు ఉన్నారు. గతంలో మహా కుంభ్‌మేళా సమయంలో జరిగిన తొక్కిసలాటపై ఆమె ఒక వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఆమె తన అనుభవాలను, ఆ ఘటనలో బాధితులకు ఎలా సహాయం చేశారో వివరించారు. ఈ భావోద్వేగపూరితమైన వీడియో వైరల్ కావడంతో ఆమెకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టింది.

# పెళ్లి సంబంధం పేరుతో బురిడీ

## నగదు, బంగారం దోచేసిన పెళ్లిళ్ల పేరమ్మ - అరెస్టు చేసిన పోలీసులు



**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
దొంగతనాలకు ఎలాంటి ఉపాయమైనా మంచిదే అనుకున్నదో ఏమో.. ఓ పెళ్ళిళ్ళ పేరమ్మ పెళ్లి సంబంధం నాటక మాడి నగదు, బంగారంతో ఉడాయించింది. బాధితుల ఫిర్యాదుతో ఇప్పుడు కటకటాల వెనక్కి వెళ్లింది. మీకు తెలిసిన వాళ్ళు ఉంటే చెప్పండి. నేను పెండ్లి సంబంధాలు చూస్తామంటూ చెప్పడంతో వారు నమ్మారు. ఇంట్లో వాళ్ళను పెళ్లి సంబంధం పేరుతో బయటకు పంపిన ఆ మహిళ వారి ఇంట్లోనే చోరీకి పాల్పడింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తాళ్లగురిజాలలో జరిగింది. ఈ నయా తరహా చోరీ వివరాలు తెలిసి పోలీసులు విస్తుపోయారు. పుల్లగొర్ల పుష్పలత అనే మహిళ తాను పెండ్లి సంబంధాలు చూస్తానని చెప్పి.. తాళ్లగురిజాలకు చెందిన ఇందూరి చంద్రశేఖర్ వద్దకు వెళ్ళింది. ఆయన తన తమ్ముడు మహేందర్‌కి సంబంధం చూడమని చెప్పడంతో ఆమె సరేనని ఒప్పుకుంది. ఈ నెల 22న ఉదయం చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి మీ తమ్ముడికి మంచిర్యాలలో పెళ్లి సంబంధం చూశాను మీరంతా కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు రావాలని చెప్పింది. దీంతో వారంతా మంచిర్యాలకు వచ్చారు. ఆమె మాత్రం తాను వేసుకున్న పథకం ప్రకారం చంద్రశేఖర్ ఇంటికి వెళ్లింది. చంద్రశేఖర్ వాళ్ళ పాప ఇంటి దగ్గర ఉండడం గమనించి ఆమెను కిరాణం షాప్‌కి పంపింది. ఆ తర్వాత ఇంటి తాళం పగులగొట్టి బీరువా తాళం ఒక ఐరన్ రాడ్‌తో ఓపెన్ చేసి అందులో ఉన్న బంగారు నెక్లెస్, రూ.15,000 దొంగతనం చేసి ఉడాయించింది. ఆ తర్వాత తీసుకొని బయటకు వచ్చేసి, గొల్లగూడ కన్నాలలోని ఆమె ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం దొంగిలిచిన బంగారు నెక్లెస్ బెల్లంపల్లి పట్టణంలో విక్రయించేందుకు వెళ్తుండగా, తాళ్ల గురజాల ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ బాబాజీ, కానిస్టేబుల్ తిరుమల ఆమెను అదుపులోకి తీసుకున్నారు. పుష్పలత వద్ద బంగారు నెక్లెస్, 15,000 రూపాయలు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. ఈ నయా తరహా దొంగతనం పట్టణంలో తీవ్ర కలకలం రేపింది.



## నెమళ్లు, జింకను
# వేటాడిన ఇద్దరు అరెస్ట్

**ఆదిలాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం గిమ్మలో సోమవారం అటవీశాఖ అధికారులు ఇద్దరిని అరెస్టు చేశారు. రాథోడ్ సందీప్, సంజీవ్ లు మహారాష్ట్రకు చెందిన నీలేశ్, రోషన్‌లతో కలిసి మహారాష్ట్ర అటవీ ప్రాంతంలో నాలుగు నెమళ్లు, ఒక జింకను వేటాడి చంపి, భోరజ్‌లో విక్రయిస్తున్నట్లు ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ చిన్న విశ్వనాథ్ భూషరడ్డి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన నీలేశ్, రోషన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## ఎలుగుబంటి దాడిలో
# వ్యక్తికి తీవ్రగాయాలు

**తిర్యాణి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని గంభీరావుపేట్ గ్రామానికి చెందిన ఆవుల భూమయ్య(60) అనే కూలిపై సోమవారం ఎలుగుబంటి దాడి చేసింది. భూమయ్య వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అటవీ ప్రాంతంలో పశువులను మేపడానికి వెళ్ళాడు. ఎలుగుబంటి భూమయ్య పై దాడి చేయగా, భూమయ్య అరుపులు విన్న పాటగూడ గిరిజనులు అక్కడికి వెళ్లి చూడగా తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. గిరిజనులు తిర్యాణిప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భూమయ్యను కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించారు.



# గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

**నెన్నెల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత కుటుంబాలు తయారుచేసి గ్రామాలలో అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం పట్టుకొని వారి వద్ద నుండి రెండు బైక్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పాల్తే వెంక నాయక్ (చిన్న లంబాడి తండ), జతోత్ శ్రీనివాస్ (చిన్న లంబాడి తండ), ధరావత్ స్వప్న (పెద్ద లంబాడి తండా, మన్నెగూడెం) లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎక్కడైనా గుడుంబా అమ్మిన, తయారుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



# ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



## ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
యూరియా కొరత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో రైతుల పక్షాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డికి కనబడడం లేదా, చెవులు వినపడడం లేదా నీకు పిరపాలన చేతకాక పోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతుకు యూరియా ఇబ్బంది లేకుండా పంపిణీ చేయడం జరిగిందని, 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, రవీందర్, అహ్మద్, బలరాం, నిసార్, లక్ష్మణ్, భీమేష్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, శ్రీను, రవి, కిట్టయ్య, మల్లయ్య, పెంటు, పోచన్న తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ అదిష్ఠానం పిలుపుమేరకు జిల్లాలోని తిర్యా ణి, వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూరు(యు), కౌటా ల, రెబ్బెన మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు యూరి యా కొరతపై ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. రైతు లకు యూరియా పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

### రైతులకు అన్యాయం..

రైతులకు యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానికంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు కేంద్రంతో మా ట్లాడి యూరియాను తెప్పించాల్సి పోయి రైతుల విషయంలో నాటకాలు ఆడుతున్నారన్నారు. సిర్పూరు నుంచే తాను పోటీ చేస్తానని, ఇందుకు కేటీఆర్, కేసీఆర్‌లను ఒప్పించి బరిలో ఉండేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. సమావేశంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, కొంగ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మినాజ్, పార్వతి, అంజన్న, వరలక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయం మాటున
# గంజాయి సాగు
### పోలీసుల దాడులతో బట్టబయలు

**ఆదిలాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయం మాటున గంజాయి సాగు యదేచ్ఛగా కొనసాగుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పోలీసులు దాడు లు నిర్వహించిన గంజాయి సాగు మాత్రం అడగం లేదు. తాజాగా నార్నూర్ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంగాపూర్ గ్రామ శివారులో గంజాయి పండిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సీసీఎస్ బృందం, నార్నూర్ పోలీసులు సంయుక్తంగా పంట పొలాల్లో తనిఖీలు చేపట్టారు. కాగా కొడప దేవురావు అనే వ్యక్తి వ్యవసాయం మాటున చట్ట వ్యతిరేకంగా గంజాయి సాగు చేస్తున్నారని తెలిసింది. 95 గంజాయి మొక్కలను పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై ఎన్.డి.పి.ఎస్ కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వ్యవసాయ భూమిలో చట్ట వ్యతిరేకంగా గం జాయి మొక్కలను పండిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్నర్ సీఐ ప్రభాకర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, నార్నూర్ ఎస్సై అఖిల్, పాల్గొన్నారు.



## రైలు కిందపడి
# వృద్ధుడి ఆత్మహత్య

**మందమర్రి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
మందమర్రిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం రోజున ఉదయం గుర్తు తెలియని వ్యక్తి విజయవాడ నుండి బల్లర్ష వైపు వెళ్తున్న రాప్తి సాగర్ ఎక్స్ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని మరణించి ఉన్నాడు. మృతిని వయస్సు అరవై సంవత్సరాలు పై బడిన వ్యక్తిలా ఉన్నాడని మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి బెల్లంపల్లి మార్చురీ రూమ్ నందు భద్రపరచారు. ఈ వ్యక్తి సమాచారం ఎవరికైనా తెలిసినచో ఈ నెంబర్లకు 9490 871784, 8712658596,9948481902 వెంటనే సంప్రదించగలరు అని రైల్వే పోలీసులు తెలిపారు.

# ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేయాలి

### బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి
### తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**దండేపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటి పథకాల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని, వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నా యకులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. సోమవారం దండేపల్లిలో బీజేపి ఆధ్వర్యంలో దండేపల్లి బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, ప్రజలతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్న ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. 2లక్షలపైగా ఉన్న రైతులకు పంట రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. ఆయకట్టు చివరిపంటలకు సాగునీరు అందించాలన్నారు. ఉన్నత విద్యకు దండేపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిమాండ్‌తో కూడిన వినత్రినతాన్ని దండేపల్లి తహసీల్దార్ రోహిత్‌దేశ్ పాండేకుఅందజేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రవిగౌడ్, సంతోష్, అనిల్, గూడెం పీఏసీఎస్ చైర్మన్ సురేష్, నాయకులు వెంకటరమణరావు, కృష్ణమూర్తి, రాజన్న, ప్రభాకర్, కిషన్, తులసి, హరిగో పాల్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



## మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్

నార్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు, రైతుల ఆధ్వర్యంలో ధర్నా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయంలో రైతు సంక్షేమానికి నాడు కేసీఆర్ ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వ్యవసాయ సాగుకు అరకొర ఎరువు పంపిణీ చేస్తూ సరిపెట్టడం సిగ్గుచేటు అన్నారు. పదేండ్ల పాలనలో రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారు అని గుర్తు చేశారు. సరిపడినంత ఎరువులు అందించే వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు ఎరువుల కోసం పనిడి గాడ్పులు పడాల్సిన పరిస్థితి. రైతులు ఇబ్బంది పడకుండా కావలసిన యూరియా అందించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కనీసం ఎకరానికి యూరియా ఒక సంచి చొప్పున అందించే దిశగా చూడాలన్నారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడె సురేష్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావ్, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్ దేవ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కాంబ్లే, మాజీ ఎంపిటిసి రాథోడ్ రమేష్, సుభాష్, సయ్యద్ ఖాసిం రైతులు ఉన్నారు.



### రేషన్ డీలర్ల డిమాండ్లు
## పరిష్కరించాలని వినతి

సోన్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి కమిషన్ ప్రతి నెల విడుదల చేయాలని గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ సోమవారం తసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఐదు నెలలుగా కమిషన్ డబ్బులు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బంది గురవుతున్నామని ప్రభుత్వం ప్రకటించిన గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని అన్ని మండలాల్లో తసిల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. సోన్ మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆ సంఘం నాయకులు అనంతుల రాజేందర్ దశరథ్ రాము తదితరులు పాల్గొన్నారు.

### స్వదేశీ జాగరణ మంచి
## ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ




నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
నిర్మల్ జిల్లా కేంద్రంలో స్వదేశీ జాగరణ మంచి ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ ట్యాంక్బండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి స్వదేశీ వస్తువులను మాత్రమే పౌరులు కొనుగోలు చేయాలని దీని వల్ల దేశ సంపద పెరుగుతుందని సంఘ నాయకులు శ్రావణ్ కుమార్ దినేష్ పేర్కొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని
## తహసీల్దార్‌కు వినతి

నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులు తమ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో జిల్లాలోని మొత్తం 18 మండలాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పత్తు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య మాట్లాడుతూ, సమాజంలో ప్రజల సమస్యలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పల్లె నుంచి పట్టణాల వరకు 24 గంటలూ శ్రమిస్తూ ప్రజాసేవలో ఉన్నప్పటికీ, తమకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వ సహకారం అందకపోవడం వల్ల తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడి విజయవంతం చేయాలన్నారు.



# కబ్జాకోర్ల నుంచి ఇందిరమ్మ స్థలాలు



బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
పట్టణంలోని ఎల్లమ్మ గుడి ప్రాంతంలోని గతంలో ఇచ్చిన ఇందిరమ్మ స్థలాలను కొందరు ఆక్రమించుకుంటున్నారని లబ్ధిదారులు బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ను కలిసి మొరపెట్టుకున్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో బాధితులు సబ్ కలెక్టర్ ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. 2007-2014 కాలంలో బెల్లంపల్లి పట్టణ (అర్బన్)కి సొంత స్థలం లేకపోవడంతో అప్పటి ప్రభుత్వం ఇంద్రమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులకి బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్ పక్కనగల ఎల్లమ్మ గుడి 170పీపీ లో స్థలాలు కేటాయించిందని తెలిపారు. 34 వార్డుల్లోనీ పేదలు కేటాయించిన ఇంద్రమ్మ ఇండ్లు పట్టుకున్నారని తెలిపారు. వాటితో పాటు ఖాళీ ఇండ్లను, స్థలాలను ఆక్రమిస్తున్నారని తెలిపారు. కట్టుకున్న ఇళ్లను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేసి అక్రమిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం తహసిల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పర్మిషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తులు పెండింగ్లోనే ఉన్నాయని వాపోయారు. కబ్జాకోరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని సబ్ కలెక్టర్ కి లబ్ధిదారులు వివరించారు.

# పార్టీ శ్రేణులతో బాల్క సుమన్ సమీక్ష సమావేశం



రామకృష్ణాపూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
అప్పుడే మంచిగా ఉండే మా గ్రామం నుంచి పోరాటం అంటూ బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం సుమన్ క్యాతనపల్లి తన నివాసంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి రానున్న స్థానిక సంస్థల ఎన్నిక సన్నాహ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ, గ్రామాల నుంచే మళ్లీ పోరాటం చేయవలసిన సమయం వచ్చిందని సుమన్ పార్టీ శ్రేణులకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్ల పాలనలో ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటూ అప్పుడే మంచిగుండే అని బాల్క సుమన్ అన్నారు. రాష్ట్రంలో రైతులకు సకాలంలో ఎరువులు లభించేవని సుమన్ అన్నారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, ఆసరా పెన్షన్ కులవృత్తులకు చేయూత కార్యక్రమాలతో ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెచ్చిన పథకాలు ప్రజలకు బాగా చేరువైంది రాష్ట్రం అప్పుడే మంచిగా ఉండే అంటూ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు, సకాలంలో ఎరువులు అందించామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు అందించక పోవడమే కాకుండా ఎరువుల కోసం రైతులను ఎండ,వానల్లో పడిగాపులు కాస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో సంపాదించుకున్న అభివృద్ధి, సంక్షేమం, ఆత్మగౌరవన్ని తిరిగి పొందాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఎన్నిక సమయంలో నియోజక వర్గంలోని ముప్పు పొంచి ఉన్న పొలాలకు రక్షణగా గోదావరి, ప్రాణహిత నదులకు కరకట్టలు నిర్మిస్తామని రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో 20 నెలలుగా ఆ ఊసే మర్చిపోయారని దుయ్యబట్టారు.సింగరేణి ప్రాంత నిరుద్యోగులకు నలభై వేల ఉద్యోగులు ఇప్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని మండిపడ్డారు.రానున్న జడ్పీటీసీ, ఎంపిటిసి,సర్పంచ్ ఎన్నికల్లో తమదే పై చేయని,పార్టీ గెలుపుకు శ్రేణులు కృషి చేయాలని సుమన్ పిలుపునిచ్చారు.

**పార్టీలో చేరికలు...**
నియోజకవర్గంలోని కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బాల్క సుమన్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకుని బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి రాజరమేష్, పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్,మందమర్రి పట్టణ అధ్యక్షుడు రవీందర్, మాజీ జడ్పిటిసి రవి కుమార్, అనిల్ రావు,ఓదేలు, మహేష్,విద్యార్థి విభాగ నాయకులు పాల్గొన్నారు.



### సమ్యలు పరిష్కరించాలని
## ఎమ్మెల్యేకు ఆటో డ్రైవర్ల వినతి

బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
బెల్లంపల్లి పట్టణంలోని బాట్వాన్‌పల్లి, పెరికపల్లి, గుండ్ల సోమారం ఆటో స్టాండ్ సమస్యలపై సోమవారం ఆటో డ్రైవర్లు బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా మార్కెట్ ఎదురుగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకొని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ అధికారులు తమ ఆటో స్టాండ్ నుండి లోపల చదును చేసే భూమి కొరకు దారి కావాలని ఒత్తిడి తీసుకు వస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆటో స్టాండ్ స్థలాన్ని కాపాడతానని డ్రైవర్లకు హామీ ఇచ్చారు.

### జర్నలిస్టులకు ఇళ్ల
## స్థలాలు కేటాయించాలి

కుభీర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)
కుభీర్ మండలంలోని జర్నలిస్టులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల తహసీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతోకాలంగా కష్టపడి పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు కూడా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని, వారికి తగిన గుర్తింపు, గృహ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గపురుద్దీన్, విఠల్, రవి కుమార్, సాయన్న, పండరి, బాలాజీ, ప్రసాద్, ఆనంద్, మోహియుద్దీన్‌లు వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.



# గిరిజన విద్యార్థులకు ల్యాప్ ట్యాప్ చెక్కులు పంపిణీ

**ఉట్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థికి ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తాల్యాప్ టాప్ పంపిణీ చేశారు. ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థికి ప్రోత్సాహకంగా ల్యాప్ టాప్ అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలని సూచించారు, ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ సింగ్ జెఈఈ మెయిన్స్ చదవుల కొరకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పై చదువుల నిమిత్తం ల్యాప్ టాప్ మరియు పై చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో (8) మంది గిరిజన విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫల మైందని బీజేపీ అదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు బంతి పెల్లి దయాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రూరల్ మండలం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం ఇన్చార్జ్ జోగు రవి, విట్టల్, సత్యనారాయణ,వెంకట రమణ,స్వామి పాల్గొన్నారు.



# విలేకరుల సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్‌లో ర్యాలీ



**ఖానాపూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో టియుడబ్ల్యూజె(ఐజెయు) జిల్లా శాఖ పిలుపు మేరకు విలేకరుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఖానాపూర్ ప్రాంత యూనియన్ సభ్యులు పట్టణం లో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ సుజాత రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ర్యాలీ ఖానాపూర్ ప్రెస్ క్లబ్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా టియు డబ్ల్యూజె(ఐజెయు) జాతీయ కార్యవర్గ సభ్యులు గాండ్ల రాజాశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎస్.కె తన్వీర్, ఖానాపూర్ ప్రెస్ క్లబ్ సమన్వయకర్త పాలిక్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా శాఖ ఆదేశాల మేరకు దీర్ఘకాలికంగా ఉన్న విలేకరుల సమస్యలు పరిష్కరించాలని, కొన్ని సంవత్సరాలుగా విలేకరుల వృత్తిలో కొనసాగుతున్న వారికి ఇండ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వాలు మారిన నాయకులు మారిన ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి సమస్యలు పరిష్కరించే దిశగా తీసుకువెళ్లే విలేకరులను ప్రభుత్వ ఆదుకొని ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ప్రెస్ క్లబ్ విలేకరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని

# బీజేపీ నాయకుల నిరసన



**ఇంద్రవెల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను విస్మరించిందని, వెంటనే హామీలను అమలు చేయాలని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మహిళలకు 2500 రూపాయలతో పాటు, కౌలు రైతులకు ఏడాదికి 12వేల 500రూపాయలు ఇస్తామని చెప్పి నేడు గెలిచిన ఆ మాటలను మర్చిపోయిందని, తూతూ మంత్రంగా రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని,కొందరికి చేసి చేతులు దులుపుకోవడం సరైన విధానం కాదని అన్నారు.కళ్యాణ లక్ష్మీ పథకం కింద రూపాయి 1లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ కో-కన్వీనర్ ఆరెల్లి రాజలింగం,జిల్లా స్వచ్ఛభారత్ కన్వీనర్ దీపక్ సింగ్ షేకావత్,జిల్లా నాయకుడు శివకుమార్ జైస్వాల్,మండల ప్రధాన కార్యదర్శి కనక హనుమంతు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రాథోడ్ రాధిక,గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు, మాజీ ఎంపిటిసి కోవ రాజేశ్వర్,మండల నాయకులు ముండే రాజేశ్వర్,మెస్రం తుకారాం,మస్కే రాజావర్ధన్, మెస్రం జైరాం,గేడం యశ్వంత్,ఆడే మూన్ సింగ్,మరియు నాయకులు కార్యకర్తలు తదితరుఉ ఉన్నారు.



## గణేష్ ఉత్సవాలు

# ప్రశాంతంగా జరుపుకోవాలి

**నిర్మల్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం గణేష్ మండపాల నిర్వాహకులతో ఉత్సవాల నిర్వాణపై సమావేశం నిర్వహించారు. 11 రోజులపాటు నిర్వహించే ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు గణేష్ మండపాల నిర్వాకులు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాకేష్ మీనా పోలీసులు పాల్గొన్నారు.

# బీజేవైఎం నాయకుల దీక్ష

**వాంకిడి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

మండలంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ మాట్లాడారు అర్హులైన లబ్ధిదారులను పక్కన పెట్టి. అనార్హులైన కాంగ్రెస్ నాయకులు. కార్యకర్త లకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేశారని ఆరోపించారు. దీని పై అధికారులు విచారణ జరిపి.. లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు.

## రైతులకు పంట

# నష్ట పరిహారం చెల్లించాలి

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**బెజ్జూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

దహెగాం మండలంలోని కర్జి శివారులో ఎర్రవాగు ముంచెత్తడం వలన నష్టపోయిన పంట చేలను భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు. సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో ప్రాణహిత, ఎర్రవాగు, పెద్దవాగు నదుల వరుదల వల్ల దాదాపు 12వేల ఎకరలు పంట నష్టం జరిగిందని తెలిపారు. ఇప్పటికే రైతులు దాదాపు ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టారని, అందుచేత నష్టపరిహారం రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పదివేల రూపాయల నష్టపరిహారం ఏమూలకు సరిపోదని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని లేవనెత్తుతామని అన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తే రైతులు ఎవరి దయా దాక్షిణ్యాల మీద బతకాల్సిన పరిస్థితి ఉండదని, గతంలో కెసిఆర్ రద్దు చేసిన ఫసల్ బీమా యోజనను పునరుద్ధరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుస్మిత, భాజపా మండల అధ్యక్షులు దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ ఎల్కరి దామోదర్, సోమశేఖర్, మల్లాగౌడ్, రాజన్న, వెంకన్న, బక్కన్న, శ్రీను, లక్ష్మణ్, సత్యం, రవీందర్, గోపాల్, బొజ్జు తదితరులు పాల్గొన్నారు.





## నర్సాపూర్‌కు హై లెవెల్

# వంతెన నిర్మించాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజీ తుడుండెబ్బ దీక్షకు మద్దతు

**బెల్లంపల్లి, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

తాండూరు మండలంలోని నర్సాపూర్ గిరిజన గ్రామానికి హై లెవెల్ వంతెన నిర్మించాలి అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు తుడుండెబ్బ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరహార దీక్షకు బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యల ఏమాజి మాట్లాడుతూ వర్షం పడితే గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచి పోతుందన్నారు. నర్సాపూర్ గ్రామానికి వెళ్లడానికి భీమన్న వాగుపై హై లెవెల్ వంతెన నిర్మించాలి అని అన్నారు. నర్సాపూర్ నుండి బెజ్జాల వరకు బిటి రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు అనుమతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ హైదరాబాద్లో ఉంటూ ప్రజల సమస్యలు గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రజల సమస్యలు పట్టక పోతే పుట్టగతులుండవని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి,మండల అధ్యక్షులు భరత్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు, సీనియర్ నాయకులు శేషగిరి,చిరంజీవి,మల్లేష్, పుట్ట కుమార్, సురేష్, నాగభూషణం, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల అందజేత

**ఖానాపూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ మున్సిపల్ 11వ వార్డులో ఒక నిరుపేద కుటుంబానికి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల రాజీవ్‌నగర్ కాలనీలో కుటుంబ పెద్ద కిషోర్ సింగ్ మరణించగా ఆ తల్లి నలుగురు పిల్లలను పోషించుకుంటూ కష్టపడుతున్న నేపథ్యంలో గమనించిన మాజీ చైర్మన్ వారికి నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, సిబ్బంది కమల్ రాజ్, పోశెట్టి, కాలనీవాసులు పాల్గొన్నారు.








# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు - ఎవరూ దళారులను ఆశ్రయించవద్దు**
**లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణి చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**
**పాల్గొన్న ఐటిడిఎ పిఓ, సబ్ కలెక్టర్**



**ఉట్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆశించిన ఫలితాలను సాధిస్తుందని లబ్ధిదారులకు పూర్తి పారదర్శకతతో ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 980మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఐటిడిఎ పిఓ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు మొదటి విడత కింద ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు త్వరితగితన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్ల ద్వారా నిర్మించిన ఇల్లు నాణ్యతా పాటించేలా చూడాలన్నారు.

ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. మంజూరు కానీ లబ్ధిదారులు కరెంటు అకౌంట్ ఆధార్ నెంబర్ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. పథకం ప్రయోజనాలు అందుతాయని ప్రాజెక్టు అధికారిని సబ్ కలెక్టర్ వివరించారు.
పథకం అమలులో ఎటువంటి అవినీతికి తావులేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ప్రాజెక్ట్ అధికారి అన్నారు 'ఎవరైనా డబ్బులు అడిగితే నాకు ఫోన్ చేయండి' అని లబ్ధిదారులకు నేరుగా సూచించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. లబ్ధిదారులు కేవలం రవాణా చార్జీలు మాత్రమే భరించాల్సి ఉంటుందని వివరించారు. ఇది నిర్మాణ వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. తద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గుతుంది.

ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమం విజయవంతానికి కలిసికట్టుగా కృషి చేశారన్నారు ఇందిరమ్మ ఇండ్ల పథకం కేవలం ఇళ్లను నిర్మించడమే కాకుండా.. సామాజిక భద్రతను, ఆత్మగౌరవాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. సొంత ఇల్లు ఉండటం పేద కుటుంబాలకు స్థిరత్వాన్ని అందిస్తుంది. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ప్రవీణ్ మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్ స్థానిక ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌తో జీవితం అంధకారం చేసుకోవద్దు

**మంచిర్యాల, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. మంచిర్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులకు



ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరదా పేరుతో ర్యాగింగ్‌లకు పాల్పడవద్దన్నారు. ర్యాగింగ్ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాగింగ్ చేయడం వల్ల కేసులు నమోదై వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. యాంటిర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని కమిటీలో కళాశాల యాజమాన్యంతో పాటు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఏచిన్న సమస్య తలెత్తిన యాజమాన్యానికి సమాచారం అందించాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినవారితో పాటు యాజమాన్యంపై కూడ చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి ఎదగాలంటే విద్యపై శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్‌రావు, కళాశాల యాజమాన్యం, మెడికల్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రికార్డులలో సరిచూసి క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆయా మండలాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా సర్వే ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్ సోమేశ్వర్, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

**అర్జీదారుల దరఖాస్తులను**
# త్వరగా పరిష్కరించాలి
**ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా**

**ఉట్నూర్, ఆగస్టు 25 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజమణి తనకు ఇంటర్ కళాశాలలో అడ్మిషన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిరికొండ మండలం రాయిగూడ గ్రామానికి చెందిన సిడం శ్రీకాంత్ తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బజార్ హత్నూర్ మండలం కొత్తగూడ గ్రామానికి చెందిన గెడం తేజస్విని తనకు ఏదైనా సిఆర్‌టి ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బజార్‌హత్నూర్ మండలం అనంతపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రూపభాయ్ తనకు భూమి పట్టా మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

